

# కథా కౌముది

## మృత్యుంజయుడు - ఆర్. శర్మ దంతుర్తి

**శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**23 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**ఉత్తమ కథానిక విభాగం విజేత**

**సాయంత్రం** నాలుగింటికి ఇంటికొచ్చిన జితేంద్ర కులకర్ణి కి గరాజ్ తలుపు దగ్గిరే సిద్ధంగా ఉన్న పదేళ్ళకొడుకు కార్తీక్ కనిపించేడు. సాయంత్రం ఆరింటికి వెళ్ళబోయే సాకర్ గేమ్ కి అప్పుడే తయారుగా ఉన్నట్టున్నాడు. తండ్రి కారు తలుపు వేసి ఆఫీసు బేగ్ తో లోపలకి రాగానే వాటేసుకుని చెప్పేడు, "డాడ్ ఇవాళ నా సాకర్ గేమ్ గుర్తుందా?"

చేతిలో ఉన్న బేగ్, మెయిల్ బాక్స్ లోంచి తెచ్చిన ఆ రోజు మెయిల్ టేబుల్ మీద పెట్టి నవ్వుతూ చెప్పేడు జితేంద్ర, "నువ్వెప్పుడు మర్చిపోనిచ్చావురా నాయనా? ఆ క్లాసులో నిన్ను ఎన్ రోల్ చేసిన రోజు నుంచి ఇవాళ దాకా రోజుకి పది సార్లు గుర్తు చేస్తూనే ఉన్నావు కదా? అందుకే ఓ గంట ముందు వచ్చాను. కాస్త బట్టలు మార్చుకుని టీ తాగి బయల్దేరుదాం సరేనా?"

"సరే," కుర్రాడు తన గదిలోకి పరుగెట్టాడు.

చిక్కని పాలు తాగితే కొలెస్టరాలూ అవీ అంటుకుంటాయి కనక మైక్రోవేవ్ లో కప్పు నీళ్ళపాలూ, అందులో ఓ టీ పేకెట్టూ పారేసి బట్టలు మార్చుకోవడానికి మేడ మీద బెడ్రూం లోకి దూరేడు జితేంద్ర. బయటకి వచ్చేసరికి బయట కారు చప్పుడు వినిపించింది. ఆషా ఆఫీసునుంచి వచ్చినట్టుంది. ఆవిడ లోపలకి రాగానే పలకరించి అడిగేడు జితేంద్ర, "టీ తాగుతావా? ఇప్పుడే నేనూ తాగుదామనుకుంటున్నా."

"సరే, పెట్టండి, నేనూ పది నిముషాల్లో తయారై వస్తా. మీరిద్దరూ సాకర్ ప్రాక్టీస్ కి వెళ్తున్నారా? వచ్చేసరికి ఏదో చేసి పెడతాను డిన్నర్ కి."

అరగంట పోయాక తల్లికో ముద్దిచ్చి బయల్దేరిన కార్తీక్ ని తీసుకుని కుర్రాడి సాకర్ ప్రాక్టీస్ కోసం, పది మైళ్ళ దూరంలో ఉన్న మైదానానికి డ్రైవ్ చేయడం మొదలుపెట్టాడు జితేంద్ర. దారిలో అనేకానేక ఆలోచనలు. అసలు వీడికి ఈ సాకర్ ప్రాక్టీస్ ఎందుకో? ఆ ఆటలో ఎలాగా ప్రొఫెషనల్ అవలేడు. చదువులో ముందుంటే అదే చాలు. జీవితంలో అసలు ఎక్సర్ సైజ్ అనేది ఎందుకో, అది రోజూ చేయాలనీ తెలిస్తే తర్వాత వాడే దార్లో పడతాడు. సాకర్ ప్రాక్టీస్ అనీ బేస్ బాల్ అనీ, స్విమ్మింగ్ అనీ, ఇదనీ, అదనీ పిల్లల్ని ఊదరకొట్టడం. వాళ్ళు సరిగ్గా చేయలేకపోతే మరో ఏడుపు; ఎందుకొచ్చిన గోల. తొమ్మిదేళ్ళ వయసులో తాము ఇండియాలో ఏమి చేయగలిగారు? మహా అయితే బాంబేలో ఈత కొట్టడం నేర్చుకున్నారేమో. ఆ మహానగరంలో ఉన్న ఒక బెడ్రూం, హాల్ ఇంటిలో కాలు కదపాలన్నా, ఏం చేయాలన్నా ఇరుకు. అందుకేనేమో తమకి అందుబాటులో లేని అవకాశాలన్నీ ఈ తరం కుర్రాళ్ళకి ఉన్నాయని, వాళ్ళని ఇది చేయి అది చేయి అంటూ తోయడం. చటుక్కున ఓ జోకు గుర్తొచ్చింది జితేంద్రకి.

స్కూల్లో పాఠాలు చెప్పే టీచర్లు ఒకే ఒక సబ్జక్ట్ చెప్పాలి. ఒక సబ్జక్టు మించి వాళ్ళు చెప్పరు. లెక్కలు చెప్పేవాడు సైన్సు చెప్పడు. అలాగే హిస్టరీ చెప్పేవాడు సైన్సూ, లెక్కలూ చెప్పరాదు; చెప్పమన్నా వాళ్ళకి రాదు. కానీ చదువుకునే పదీ, పన్నెండేళ్ళ కుర్రాళ్ళు మాత్రం ప్రతీ సబ్జక్టులోనూ ఫస్ట్ మార్కు తెచ్చుకోవాలి. పెద్దవాళ్ళైన మనకి చేతకాని పని కుర్రాళ్ళు మాత్రం ఎలా చేస్తారో? ఫకాల్న నవ్వు వచ్చింది అనుకోకుండా నోట్లోంచి.

నవ్వుతున్న తండ్రిని అడిగేడు కార్తీక్, “ఎందుకు నాన్నా నవ్వుతున్నావ్?”

“ఏం లేదురా, ఈ సాకర్ ప్రాక్టీస్ ఎన్నేళ్ళు సాగుతుందా, నీకు ముందు ముందు జీవితంలో ఎలా ఉపయోగ పడుతుందా అని ఆలోచిస్తున్నాను అంతే.”

కుర్రాడికీ మాట అర్థమైందో లేదో కానీ ఓ వెర్రినవ్వు నవ్వేడు. మిగతా ప్రయాణం మామూలుగా సాగింది, ఆరోజు స్కూల్లో ఏం చేసాడు, టీచర్ ఎలా చెప్తున్నాడు అనేవి మాట్లాడుతూ, వాటికి కార్తీక్ ఇచ్చే సమాధానం వింటూ. మైదానం దగ్గిర కుర్రాణ్ణి కోచ్ కి అప్పగించి అక్కడే ఉన్న బెంచీ మీద కూర్చున్నాడు జితేంద్ర. పక్కనే మిగిలిన కుర్రవాళ్ళ తల్లో, తండ్రో కాబోలు కూర్చొని ఉన్నారు. అందరికీ హాయ్ అని చెప్పి ఫోన్ తీసి ఆషా కి మెసేజ్ కొట్టేడు, “ఇప్పుడే ప్రాక్టీస్ మొదలైంది, ఏమి చేస్తున్నావ్ హనీ” అంటూ.

హనీ గారి దగ్గిర్నుంచి అంత తీయగా లేని సమాధానం వచ్చింది వెంటనే. “వంట మొదలుపెట్టా. దాల్ ఫ్రై, నిన్న మిగిలిన కూర, కొన్ని రోటీలు, మామూలుగా రైస్.”

“సరే, ప్రాక్టీస్ అయిపోయాక బయల్దేరే ముందు మరోసారి మెసేజ్ పంపిస్తా,” ఫోన్ జేబులో పెట్టి సాకర్ చూడడం మొదలు పెట్టాడు. కుర్రాళ్ళు అటూ ఇటూ పరుగులు పెడుతూంటే కోచ్ ఎలా కిక్ ఇవ్వాలో, ఎలా పాస్ ఇవ్వాలో చెప్తున్నాడు. అరగంట పోయాక చిన్న బ్రేక్. ఆ తర్వాత సరదాగా చిన్న సాకర్ మేచ్ కుర్రాళ్ల మధ్య. ఆ సరదా మేచ్ లో తల్లీ తండ్రీ అందరూ, ఎంకరేజ్ చేయడానికి “గో, గో” అని అరుస్తూంటే తానూ అరవడం మొదలుపెట్టాడు జితేంద్ర. దాదాపు మేచ్ ముగుస్తూండగా పరుగెట్టే కార్తీక్ ఒక్కసారి ముందుకి పడ్డాడు. ఎవరూ తోసినట్టు లేదు. మొహం మీద చిన్న దెబ్బతో రక్తం కారడం మొదలైంది. కోచ్ ఒక్కసారి ముందుకెళ్ళి కుర్రాణ్ణి పైకి లేపాడు. కార్తీక్ కళ్ళు మూతపడి ఉన్నాయి. వెంటనే మెడమీద, ఛాతీమీద నాడి కొట్టుకుంటోందా లేదా చూసాడు. అంతా బాగానే ఉంది కానీ కుర్రాడు స్పృహలో లేడు. మేచ్ వెంటనే ఆపుచేసేసరికి జితేంద్ర మైదానంలోకి పరుగెట్టుకుని వెళ్ళాడు కార్తీక్ దగ్గిరకి.

“ఏమైందో తెలియదండి. నేను చూస్తూనే ఉన్నా. ఎవరూ తోయలేదు. ఎందుకేనా మంచిది ఏంబులెన్స్ కి ఫోన్ చేద్దాం,” అపాలజీ చెప్తున్నట్టూ అంటూ ఫోన్ తీసి 911 కి కాల్ చేసి ఏంబులెన్స్ పంపమని చెప్పేడు కోచ్.

జితేంద్రకి ఏమి చేయాలో తెలియలేదు. తన వణికే చేత్తో కుర్రాడి చేయిపట్టుకుని అక్కడే మైదానంలో కూర్చున్నాడు. కన్నీళ్ళొక్కటే తక్కువ. పక్కనే ఉన్న మరో కుర్రాడి తండ్రి చెప్పాడు, “ఏమీ కంగారు పడకండి. ఇటువంటివి కుర్రాళ్ళలో సర్వసాధారణం. మేము ఏంబులెన్స్ వచ్చేదాకా మీ దగ్గిర ఉంటాం. కుర్రాడికి నాడి బాగానే ఆడుతోంది. ఊపిరి తీసుకుంటున్నాడు. ఏదో నీరస పడ్డాడేమో గంట ప్రాక్టీస్ వల్ల.”

పది నిముషాలు పది యుగాలుగా గడిచేక వచ్చిన ఏంబులెన్స్ కుర్రాడికి ఆక్సిజన్ మాస్క్ తగిలించి చెవులు గింగుర్లెత్తేలా సైరన్ మోగించుకుంటూ ఊర్లో ఉన్న బాప్టిస్ట్ హాస్పిటల్ కి బయల్దేరింది. వెనకనే జితేంద్ర తన కారులో దాన్ని అనుసరించేడు. బయల్దేరే ముందు మరో కుర్రాడి తండ్రి, కోచ్ కూడా అవసరమైతే తమని అర్ధరాత్రైనా, అపరాత్రైనా పిలవమని ఫోన్ నెంబర్లు ఇచ్చారని కానీ, మరోటి కానీ గుర్తు లేదు మనసు స్థబ్దుగా అయిపోయిన జితేంద్రకి.

పార్కింగ్ లో కారు పెట్టి ఎమర్జన్సీలోకి పరుగెట్టాడు జితేంద్ర. మధ్యలో నర్సు అడ్డుకుని ముందు గదిలోకి పంపించింది. అక్కడ తనకున్న ఇన్స్యూరెన్సూ అవీ చూపించాలిట. ఒళ్ళు మండుతుంటే అరిచేడు జితేంద్ర, “అవతల కుర్రాడికి ప్రాణం మీదకి వస్తే ఇదేం గోల ముందు?”

“మీ కుర్రాణ్ణి డాక్టర్ అప్పుడే చూస్తున్నారు. మీకేమీ కంగారు లేదు. మీరు లోపలకి వెళ్తే డాక్టర్నీ, నర్స్ నీ కంగారు పెడతారు తప్ప మరో ఉపయోగం లేదు. మీ ఇన్స్యూరెన్స్ సంగతి చూసేలోపు మిమ్మల్ని పిలుస్తారు. ప్రశాంతంగా ఉండండి,” కౌంటర్ లో అమ్మాయి చెప్పింది.

జేబులోంచి కార్డ్ తీసి ఇచ్చేడు జితేంద్ర. మిగతా విషయాలన్నీ రాసుకున్నాక పెట్టవల్సిన చోట సంతకాలు పెట్టేసరికి లోపలనుంచి డాక్టర్ బయటకొస్తూ కనిపించేడు, “మీరేనా పిల్లాడి తండ్రి అంటూ.” ప్రాణం లేచివచ్చినట్టైంది.

“నా పేరు డాక్టర్ జేమీసన్. రండి లోపలకి వెళ్దాం.”

లోపల కుర్రాడికి అప్పుడే సెలైన్ తగిలించినట్టున్నారు. మొహం తేటగా ఉంది. “ఎలా ఉంది ఇప్పుడు? ఏమైంది అసలు వీడికి?” అడిగేడు జితేంద్ర కుర్రాణ్ణి చూసి డాక్టర్ తో కంగారుగా.

“ఒక్కొక్కప్పుడు ఇలా పిల్లలు మూర్ఛపోతూ ఉంటారు ఆటల్లో. అంత వర్రీ అవ్వాల్సిన దేమీ కనిపించదు. కుర్రాడు ఆరోగ్యంగానే కనిపిస్తున్నాడు. ఎందుకైనా మంచిదని చిన్న బ్లడ్ సాంపిల్ తీసాం. దాని రిజల్ట్ రావడానికో పావుగంట పడుతుంది. ప్రస్తుతానికి కుర్రాడికేమీ ఫర్వాలేదు. ఇక్కడే కూర్చోండి. గంటా, రెండు గంటల్లో ఇంటికెళ్ళిపోవచ్చు. కుర్రాడి తల్లి ఇక్కడే ఉన్నారా?”

అప్పటిదాకా బుర్ర పనిచేయని జితేంద్ర ఫోన్ బయటకి తీస్తూ చెప్పేడు, “తల్లి ఇంట్లో ఉంది. నేను కుర్రాణ్ణి తీసుకుని సాకర్ ప్రాక్టీస్ కి వెళ్ళాను. అక్కడనుంచి సరిగ్గా ఇక్కడకే రావడం. నాకు కాలూ చేయీ ఆడలేదు ఇప్పటివరకూ. ఇప్పుడే రమ్మని చెప్తా ఆవిడతో.”

"సరే, మీరు ఆవిడతో మాట్లాడుతూ ఉండండి, నేను బ్లడ్ రిజల్ట్ వచ్చాక అవి పట్టుకుని వస్తా." మరో పేషెంట్ ని చూడ్డానికి కదిలేడు డాక్టర్ జేమీసన్.

ఫోన్ తీసి ఆషా తో అవకతవగ్గా జరిగింది చెప్పి వెంఠనే హాస్పిటల్ కి రమ్మని చెప్పాడు జితేంద్ర. ఆవిడ కంగారుగా వంట అదీ మధ్యలో ఎక్కడిదక్కడ ఆపి ఉన్న పళంగా బయల్దేరింది. ఆషా వచ్చేసరికి డాక్టర్ జేమీసన్ జితేంద్రతో మాట్లాడుతున్నాడు బ్లడ్ రిపోర్ట్ చేత్తో పట్టుకుని. అప్పుడే కార్తీక్ కళ్ళు తెరిచి తనకి తగిలించిన సెలైన్ బాటిల్, పక్కనే ఉన్న తండ్రినీ, తల్లినీ చూస్తూ "మామ్ నాకేమైంది?" అన్నాడు దాదాపు ఏడుపు మొహంతో.

జితేంద్ర, ఆషా ఒకేసారి చెప్పారు, "ఏమీ కాలేదు. సాకర్ ఆడుతూంటే కిందపడ్డావు. తలమీద చిన్న దెబ్బ తగిలింది. ఇంకో అరగంటలో ఇంటికి వెళ్ళిపోతున్నాం." జితేంద్ర ఇటు తిరిగి మళ్ళీ డాక్టర్ తో మాట్లాడ్డం మొదలుపెట్టాడు, "బ్లడ్ రిపోర్ట్ వచ్చిందా?" ఆషా కాస్త కంగారుగా డాక్టర్ మొహంలోకి చూసింది.

"రిపోర్ట్ వచ్చింది. కాస్త తేడాగా ఉంది బ్లడ్ తెల్ల కణాల కౌంట్ అదీను. ఈ మధ్యన కుర్రాడికి నీరసం, వాంతులు, తూలిపడడం లాంటివి అవుతున్నాయా?"

"లేదే? తెల్ల కణాలు ఎందుకు ఏ కారణం వల్ల ఎక్కువ ఉండొచ్చు?"

సాలోచనగా చూసి చెప్పేడు డాక్టర్ జేమీసన్, "అనేకానేక కారణాలు ఉన్నాయి. వైరల్ లేక బాక్టీరియల్ ఇన్ ఫెక్షన్ కావొచ్చు, మరోటీ కావొచ్చు. ఇప్పుడు డిస్చార్జ్ చేసాక ఈ ఏంటీబయోటిక్ మందు వేయండి. ఇన్ ఫెక్షన్ అయితే తగ్గుతుంది. రేపు మర్చిపోకుండా మీ కుర్రాడిని పీడియాట్రీషియన్ దగ్గిరకి తీసుకెళ్ళండి, ఆయన మరికొన్ని టెస్ట్ లు చేసి అసలు కారణం చెప్తారు."

"ఇప్పుడు ఆ టెస్ట్ లు అన్నీ మీరే చేయవచ్చుగా?" ఆషా అడిగింది.

"ఎమర్జన్సీలో అవన్నీ చేయరమ్మా. ప్రస్తుతం కుర్రాడిని టెంపరరీ గా ట్రీట్ చేసి పంపిస్తాము. మిగతా విషయాలు మీరు మీ డాక్టర్ తో చర్చించాల్సి ఉంటుంది. ఆయనకి మీ కుర్రాడు చిన్నప్పటినుండీ తెలుసు కనక ఆ మెడికల్ హిస్టరీ బట్టి ఏం చేయాలో ఆయన చెప్తారు. అదీ పద్ధతి," జేమీ సన్ లేచాడు ఇంక చెప్పేదేమీ లేదన్నట్టూ.

మరో గంటకి సెలైన్ బాటిల్ లో డ్రిప్ పూర్తిగా ఖాళీ అయ్యాక, సూదులూ అవీ వంట్లోంచి తీసి కుర్రాణ్ణి కారు దాకా తీసుకొచ్చింది నర్స్. ముగ్గురూ ఇంటికి చేరారు హాస్పిటల్ ఇచ్చిన కాయితాలు పట్టుకుని. కార్తీక్ కి ఆకలి లేదంటే పాలు తాగించి వాడు పడుకున్నాక గూగిల్ మీద పడ్డాడు జితేంద్ర, బ్లడ్ రిపోర్ట్ చేత్తో పట్టుకుని.

మొదటిగా తెలిసినది – తెల్ల కణాలు ఎక్కువ ఉంటే అది లుకేమియా అవడానికి ఛాన్స్ ఉంది. చేతులు వణుకుతూంటే మిగతాది చదవడం మొదలుపెట్టాడు. అనంతకోటి దరిద్రాలలో మళ్ళీ శతకోటి దరిద్రాలు వేరన్నట్టూ ఈ లుకేమియాలో మళ్ళీ రకరకాలు – లింఫోసైటిక్, మైలాయిడ్, మైలోజెనస్, మైలోమోనోసైటిక్ అనీ; మళ్ళీ అందులో, దీని శ్రాద్ధం, దాని పిండాకూడూ అంటూ క్రానిక్, ఎక్యూట్ అనే రకాలు. మనిషి ప్రాణం తీయడానికి రెక్కలు విప్పుకుని వికట్టహాసంతో చాపకింద నీరులా కదుల్తూ వెన్నులో చలిపుట్టించే మూడు అక్షరాల

వ్యాధి – కేన్సర్. రాక, రాక ఈ పదేళ్ళ కార్తీక్ కే రావాలా? కళ్ళమ్మట రాబోయే నీళ్ళని బలవంతంగా అదిమిపెడుతూ కంప్యూటర్ కట్టేసి కుర్చీలో వెనక్కి వాలాడు జితేంద్ర కులకర్ణి. నీళ్ళమీద పడవలో కులాసాగా వెళ్తున్నప్పుడు పడవ ఒక్కసారి తిరగబడిపోతే ఊపిరాడక అనంతమైన అగాధంలోకి మునిగిపోతున్నప్పుడు కలిగే ఫీలింగ్.

కాసేపటికి వచ్చిన ఆషా అడిగింది, "ఏమి చూసారు? ఈ బ్లడ్ రిజల్ట్ మూలాన గూగిల్లో, ఇంటర్నెట్ లో ఏమైనా తెలిసిందా? ఇదేమైనా సీరియస్సా?" మొహంలో కంగారు కనబడుతూనే ఉంది.

"ఏమీ తెలియలేదు. రేపు ఆఫీసు సెలవు పెట్టి ఈ సంగతి డాక్టర్ తో మాట్లాడదాం. డాక్టర్ చెప్పినట్టూ నేను కూడా ఇది ఇన్ ఫెక్షన్ అనుకుంటున్నా. అదే అయితే మూడు రోజుల్లో మళ్ళీ సాకర్ కి బయల్దేరవచ్చు." లేని నవ్వు మొహం మీదకి తెచ్చుకుని తీయని అబద్ధం చెప్పేడు జితేంద్ర ఆషాని ఉత్సాహపర్చడానికి.

మర్నాడు లేస్తూనే పొద్దున్న జితేంద్ర మొదటగా చేసిన ఫోన్ కాల్ కార్తీక్ డాక్టర్ కి. మొదట్లో ఆ రోజుకి అపాయింట్ మెంట్ లేదన్నారు కానీ క్రితం రోజు ఎమర్జన్సీ రూమ్ విజిట్ గురించి చెప్పేసరికి మరో రెండు గంటలు పోయాక డాక్టర్ చూడగలడుట కార్తీక్ ని. బ్లడ్ రిపోర్ట్ చూసిన డాక్టర్ మొహంలో ఏ భావం లేకుండా చెప్పేడు, మరిన్ని బ్లడ్ టెస్ట్ లు చేయించాలని. అవి సరిగ్గా ఉంటే సరే లేకపోతే అప్పుడు ఆలోచించుకోవచ్చు. ప్రస్తుతానికి ఎమర్జన్సీ రూం డాక్టర్ ఇచ్చిన మందు వాడుతూండాలి. కుర్రాడు మామూలుగా స్కూలుకి వెళ్ళొచ్చు. సాకర్ ప్రాక్టీస్ ప్రస్తుతానికి వద్దు.

మూడు రోజుల్లో మిగతా బ్లడ్ రిజల్ట్ అంతా వచ్చాక పీడియాట్రీషిన్ ఫోన్ చేసాడు జితేంద్రకి – మాట్లాడ్డానికి ఓ సారి వెంటనే రమ్మని. కూడా కుర్రవాణ్ణి తీసుకురావక్కర్లేదు. ఆషా వస్తే మంచిది. ఫోన్ పెట్టేసిన జితేంద్ర మనసు ఏదో కీడు శంకించింది – ఎందుకు తననీ, ఆషానీ రమ్మన్నాడు డాక్టరు? మరో గంటకి ఆషాతో డాక్టర్ ఆఫీసులో కూర్చున్నాక ఆయన చెప్పేడు, "ఇదంత మంచి న్యూస్ కాదు. ఈ బ్లడ్ రిజల్ట్ చూస్తూంటే మీ కుర్రాడికి లుకేమియా అని తెలుస్తోంది. కానీ నేను కేన్సర్ స్పెషలిస్ట్ ను కాదు. వెంటనే పిల్లల ఆస్పత్రిలో కేన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఏప్రిల్ పీటర్సన్ అనే ఆవిడ ఉన్నారు, ఆవిణ్ణి కలవండి. నేను ఈ రిపోర్ట్ లన్నీ ఆవిడకి పంపిస్తాను ఇప్పుడే."

"కార్తీక్ చనిపోతాడా ఇప్పుడు?" ఆషా దాదాపు ఏడుస్తూ అంది. జితేంద్ర ఆవిణ్ణి చేత్తో పట్టుకుని ఊరడించడానికి ప్రయత్నం చేసాడు.

"కేన్సర్ ఏ స్టేజ్ లో ఉందో తెలిదమ్మా నాకు. మొదటి స్టేజ్ అయితే తగ్గుతుంది. మీకు డాక్టర్ పీటర్సన్ చెప్తారు మిగతా వివరాలు. అయాం సో సారీ, నేను కేన్సర్ స్పెషలిస్ట్ ని కాదు. ఇంతకన్నా నేను ఏమీ చెప్పలేను."

రెండువారాలు గడిచాయి. మళ్ళీ బ్లడ్ టెస్ట్ లు. మరో సారి పరీక్షలు. ఇప్పుడు కొత్తగా అనేకానేక రకాల స్కాన్ లు, బయాప్సీలు. కేన్సర్ ఏ స్టేజ్ లో ఉందీ, ఎన్ని చోట్ల ఉందీ, ఎక్కడైనా గడ్డలున్నాయా, ఉత్తి లుకేమియా ఒక్కటేనా లేకపోతే చిన్నపాటి గడ్డలు తలనుంచి పాదాలదాకా ఎక్కడైనా ఉన్నాయా అనేవన్నీ చూడాలి. అప్పుడు తెలిసిన విషయాల ప్రకారం డాక్టర్ ఏప్రిల్ పీటర్సన్ గారు చెప్పినవి ఇవి – కార్తీక్ కి కేన్సర్ అనేది నిజం. దాని అసలు పేరు పిల్లల్లో వచ్చే ఎక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా. గడ్డలూ అవీ లేవు కానీ అటు మొదలూ కానీ, ఇటు చివరా

కాని– మూడో స్టేజ్ లో ఉంది. మొదటిగా చేయవల్సింది కీమో థెరపీ, ఇంట్రావీనస్ మందులు; హాస్పిటల్లో నిద్ర, తిండీ తిప్పలూ లేని బతుకులు. ఈ మందులూ, ట్రీట్ మెంట్ పేర్లూ చూస్తే న్యూక్లియార్ క్షిపణుల పేర్లన్నట్టు – ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్, షార్ట్ రేంజ్, మిడ్ రేంజ్, లాంగ్ రేంజ్, డిమోలిషన్ – నోరు తిప్పుకోలేని వెన్ను వణికించే పేర్లు – క్లోఫారబీన్, డానో రూబిసిన్, డోక్సో రూబిసిన్, మెథో ట్రెక్సేట్, విన్ క్రిష్టిన్; ఇవికాక కార్టికో స్టెరాయిడ్స్ అనబడే డెక్సా మిథాసోన్, ప్రెడ్నిసోన్ లాంటివి. యముడికీ, చిత్రగుప్తుడికీ, ఆఖరికి లయకారుడైన శివుడికి కూడా ఇంతటి కష్టమైన పేర్లు లేవే? చావు రావడం కూడా ఇంత కష్టమా? ఒకేసారి కారు ప్రమాదంలో తీసుకుపోవచ్చుగా అలా రోజూ ప్రతీ క్షణం చంపకపోతే?

ఆషా కన్నీళ్ళు ఆపుకోలేకపోతూంటే జితేంద్ర అడిగేడు డాక్టర్ పీటర్సన్ ని, “మధ్య స్టేజ్ లో ఉందన్నారు కనక మహా అయితే కార్తీక్ ఇంకా ఎంతకాలం బతకొచ్చు?”

“చెప్పలేమండి. కీమోథెరపీకి ఎలా రెస్పాండ్ అవుతాడో దాన్ని బట్టి చెప్పగలం. కానీ మొదటి మూడునెలలు మీకు కష్టంగా ఉంటుంది. మందులు పనిచేస్తే కుర్రాడు కోలుకోవచ్చు,” డాక్టర్ పీటర్సన్ చెప్పింది. కర్ర విరక్కుండా, పాము చావకుండా చెప్పడం అంటే ఇదేనా?

ఆ మర్నాటినుండి కార్తీక్ కు కీమోథెరపీ మొదలైంది. జితేంద్ర, ఆషాలలో ఎవరికి కుదిరితే వారు శెలవు పెట్టడం, కుర్రాణ్ణి థెరపీకి తీసుకెళ్ళడం. కార్తీక్ ని స్కూలు మానిపించి వారాలు కావస్తోంది. ప్రాణమే పోతూంటే స్కూల్ ఓ లెక్కా? స్కూల్ పిల్లలు అందరూ కలిసి వీలున్నప్పుడల్లా ఓ కార్డూ, గెట్ వెల్ బెలూన్లూ ఇస్తూనే ఉన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్, కార్తీక్ టీచరూ ఆఫీసు నుంచి ఫోను చేసి కనుక్కుంటూనే ఉన్నారు ఎప్పటికప్పుడు. కేన్సర్ అలా పాకుతూనే ఉంది కార్తీక్ వంట్లో. జాతస్య హి ధృవో మృత్యుర్ ధృవం జన్మ మృతస్యచ...

ఒక్కోసారి కార్తీక్ కి అర్ధరాత్రి ఏదైనా అయితే ఎమర్జన్సీకి పరుగెడుతూనే ఉన్నారు జితేంద్ర, ఆషా. మొదట్లో సాకర్ ప్రాక్టీస్ లో కార్తీక్ కళ్ళు తిరిగిపడిపోతే చూసిన డాక్టర్ జేమీసన్ కుర్రాణ్ణి రెగ్యులర్ గా ఎమర్జన్సీలో చూస్తూనే ఉన్నాడు. టెంపరరీగా ఏదో చేసి ఇంటికి పంపిస్తూనే ఉన్నాడు. ఒకప్పుడు బంతిలా ఉండే కార్తీక్ ఇప్పుడు జుట్టు లేకుండా నున్నటి గుండుతో, బరువు సగానికి సగం పడిపోయి జీవచ్ఛవం లాగా తయారయ్యేడు. బూరి బుగ్గలతో మిసమిసలాడే ఒకప్పటి కార్తీక్ ఇప్పుడు దాదాపు బయటకి తన్నుకొచ్చే బొమికలతో ఒక అస్థిపంజరపు పోగు. కొడుకు జీవితం ఇలా అయినందుకు జితేంద్ర, ఆషా మొహాలలో ఒకప్పుడు కనిపించే వెలుగు ఇప్పుడు భూతద్దం పెట్టినా లేదు. ఏమి తింటున్నారో, ఏమి తాగుతున్నారో చూసుకోలేని జీవితం. కేవలం మూడక్షరాల కేన్సర్ వ్యాధి భాధితుల్లో ఎవర్ని అడిగినా చెప్పే సమాధానం ఇదే. కేన్సర్ – వచ్చిన ఎవర్నీ ఒక్కసారి చంపదు. వంటిని, ఇంటిని, బేంక్ ఎకౌంట్లని, చుట్టాలని, హితుల్నీ, స్నేహితుల్నీ పీల్చి పిప్పి చేసి మరీ చంపుతుంది. పోయినవాడు అదృష్టవంతుడు; ఒకేసారి పోతాడు. మరి మిగిలినవారో? వాళ్ళు జీవితాంతం కుమిలిపోతూ రోజూ ఛస్తూనే ఉండాలి.

ఆరు నెలలు పైన గడిచాక డాక్టర్ పీటర్సన్ పెదవి విరిచింది. అప్పుడు చెప్పిన ప్రకారం మహా అయితే కార్తీక్ మరో ఏడు వారాలు బతకొచ్చు. పిల్లల్లో 85 శాతం బాగా పనిచేసే కీమోథెరపీ కార్తీక్ కి పనిచేయట్లేదు. ఒకే ఒక దారి ఉంది. ఎముకల్లో గుజ్జు మార్పిడి – లేదా బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్. ఎండిన మోడు చిగురించే ఆశ. అయితే ఇందులో ఉన్న చిక్కు – సరైన దాత దొరకాలి. కార్తీక్ కి సరిపడే బోన్ మారో ఇచ్చే దాత ఎవరు? ఎంతకాలం వెదికితే దొరుకుతాడు? దొరికినా కావాల్సినంత కాలం ఇస్తాడా? చిగురించే ఆశకీ, దాన్ని మొగ్గలోనే తుంచేసే రియలిటీకి ఎంత తేడా? ఒక్క పది సెకనులేనా?

ఆ రోజు రాత్రి ఆషా, జితేంద్రలకి నిద్రలేదు. ఆషా ఇండియాలో ఉన్న తల్లికి ఎప్పటికప్పుడు ఫోన్ చేస్తూన్నా, మరో సారి చేసి చెప్పింది ఈ విషయాలన్నీ. ఆవిడ పాతకాలం మనిషి. ఏమీ ఫర్వాలేదు 'నేను నాసిక్ లో ఉన్న త్ర్యయంబకేశ్వరుడి గుడికి వెళ్ళి మృత్యుంజయ జపం చేస్తూ ఉంటా కంగారు పడకండి' అని అక్కడనుంచి చెప్తూనే ఉంది. మళ్ళీ చిన్న ఆశ. ఆవిడ జపం ఫలించి కేన్సర్ తగ్గితే? ఆషా వేయి దేవుళ్ళకి మొక్కుకుంది.

రోజులు గడుస్తూనే ఉన్నాయి. ఓ రోజు మళ్ళీ అర్ధరాత్రి ఎమర్జన్సీలో డాక్టర్ జేమీసన్ చూసాడు కార్తీక్ ని. ఈ సారి — అన్ని చావులు చూసిన జేమీసన్ కూడా – సన్నగా వణికేడు కార్తీక్ ను అవతారం చూసి. మృత్యుకళ ముందే వచ్చేసిందా అనిపించేలాగా ఉన్నాడు కుర్రాడు.

ఆ రోజు హాస్పిటల్ డ్యూటీ ముగించి ఇంటికొచ్చిన జేమీసన్ టి.వి ఆన్ చేసి సోఫాలో కూర్చున్నాడు. కార్తీక్ రూపం మనసులో మెదులుతూనే ఉంది రోజంతా. ఎటువంటి కుర్రాడు ఎలా అయ్యేడు? మనసులో ఏదో కోపం. ఏమీ చేయలేని నిస్సహాయత. చేతిలో గన్ ఉండి కేన్సర్ అనే వ్యక్తి కనక ఎదురుగా కనపడి ఉంటే గన్ లో గుళ్ళు అన్నీ ఆ కేన్సర్ మీద కాల్చేయడానికి ఏమీ అనుమానం అక్కర్లేదు. పక్కనే ఆయన పదమూడేళ్ల కూతురు జెన్నిఫర్ ఐ–పేడ్ మీద ఏదో ఆట ఆడుకుంటోంది. "ఏమ్మా స్కూల్ ఎలా ఉంది ఈ రోజు?" అడిగేడు డాక్టర్, ఏదో మాట్లాడాలి కనక.

"బానే ఉంది, మా టీచర్ పెట్టిన టెస్ట్ లో నేను మొదటి రేంక్ సంపాదించా" ఉత్సాహంగా చెప్పింది పాప మొహం ఐపేడ్ లోంచి బయటకి తీయకుండా, "మరి నీ హాస్పిటల్ ఉద్యోగం ఎలా ఉంది ఈ రోజు?"

"బాగాలేదమ్మా. నీకు చెప్పానోసారి గుర్తుందా? ఓ కుర్రాడు బంతిలాగా ఉండేవాడు బూరి బుగ్గలతో; అతనికి కేన్సర్ వచ్చిందని? అతనికి ఇప్పుడు బాగా ముదిరిపోయింది. అతన్ని చూస్తే కడుపు దేవుతోంది. భగవంతుడు ఇంత కఠినుడా అనిపిస్తోంది కూడా." ఉక్రోషం వెళ్ళగక్కేడు జేమీసన్.

పక్కనే ఉన్న కిచెన్ లోంచి వింటుందేమో, అక్కడనుంచి బాణంలాగా రివ్వుమని వచ్చింది జేమీసన్ వాళ్ళావిడ అరుపు, "ఆ మాట పిల్లల్తో చెప్పడమేమిటి? బుద్ధుందా?"

"అయామ్ సో సారీ, మనసులోది ఎంత అణచుకుందామనుకున్నా ఈ సారి అనుకోకుండా నోట్లోంచి వచ్చేసింది" అపాలజీ ఇచ్చుకున్నాడు డాక్టర్.

"కుర్రాడి పేరు ఏమిటి నాన్నా?"

"ఇండియా నుంచి వచ్చారమ్మా వాళ్ళు. వాళ్ల పేర్లు కాస్త విచిత్రంగా నోరు తిరక్కుండా ఉంటాయి మనకి. కార్ టీక్ అనో ఏదో అన్నారు. మేము హాస్పిటల్లో నోరు తిరగడానికి కార్ట్ అంటున్నాం."

"కార్ట్ అంటే మన షాపింగ్ మాల్ లో కార్ట్ లాంటిదా? లేకపోతే కార్ టీక్ అంటే అర్థం ఏమై ఉండొచ్చు?"

"నువ్వే చెప్పాలి మరి. చేతిలో ఐపేడ్ ఉంది కదా, గూగిల్ చేసి చూడు. నేను ఇప్పుడే వస్తా," బాత్రూంలోకి దూరేడు డాక్టర్ జేమీసన్ మరోసారి వాళ్ళావిడ అరిచిన అరుపు విని.

పాప ఐపేడ్ మీద సి–ఎ–ఆర్–టి కార్ట్ అని టైప్ చేయడానికి ప్రయత్నించింది. అలా టైప్ చేయడంలో ఎందుకో ఆర్, టి అనే అక్షరాల మధ్య ఓ డేష్ పడింది. అలా టైప్ చేస్తూండగానే గూగిల్ కార్ట్ థెరపీ, కార్ట్ ముల్టిపుల్ మైలోమా, లింఫోమా అనేవి ఆటోమేటిక్ గా చూపిస్తూంటే పాప కళ్ళు పెద్దవయ్యాయి. ఇదేనా తండ్రి చెప్పిన కేన్సర్? అసలు కుర్రాడి పేరు, దాని అర్ధం తెలుసుకుందామనుకునే విషయం మర్చిపోయి మొదటి లింకునుంచి అలా చూస్తూంటే జేమీసన్ బాత్రూం లోంచి బయటకొచ్చి కూతురి పక్కనే కూర్చున్నాడు టివి చూడ్డానికి.

"డాడ్ ఇది చూడు," పాప ఐపేడ్ అందించింది. టివి సంగతి మర్చిపోయి జేమీసన్ కార్ – టి అనే కొత్త కేన్సర్ ట్రీట్ మెంట్ గురించి చదవడం మొదలుపెట్టేడు. ఇదో కొత్తరకం ఇమ్యూనోథెరపీ. స్లోన్ కెటరింగ్ కేన్సర్ సెంటర్ నుంచి ఒక్కొక్క కేన్సర్ స్పెషలిస్టూ ఈ మధ్యే ప్రయోగాత్మకంగా మొదలుపెట్టినది. మిగతా మందులేవీ పనిచేయనప్పుడు ఇది చివరి ఆయుధం. మనిషి ఎలాగా పోతాడని తెలిసినప్పుడు చేతిలో ఉన్న చివరి ఆయుధం ప్రయోగించడంలో తప్పులేదు కదా?

పది నిముషాలు కళ్ళార్పకుండా అన్నీ చదివాక పాపకి ఐపేడ్ ఇచ్చేసి ఇది మర్నాడు చేయాల్సిన మొదటి పనిగా తన ఫోన్ లో రిమైండర్ పెట్టుకున్నాడు డాక్టర్ జేమీసన్.

తరవాత రోజు పొద్దున్న లేస్తూనే జేమీసన్ చేసిన మొదటి పని కేన్సర్ స్పెషలిస్టు డాక్టర్ పీటర్సన్ కి ఫోన్ చేసి కార్–టి గురించి అడగడం. జేమీసన్ చెప్పినది విన్నాక ఆవిడ అంది, "అవును నేను కూడా కుర్రాడి పేరెంట్స్ ని అడుగుదాం దీనిగురించి అనుకుంటున్నాను. చివరి దశలో కొంతమంది ఒప్పుకోరు ఎందుకంటే ఇటువంటి దశలో ఆ కార్–టి కూడా పనిచేయకపోవచ్చు. అయినా అడిగి చూస్తానులెండి."

అదే రోజు జేమీసన్ ఆషా, జితేంద్రలకి ఫోన్ చేసి చెప్పాడు, "ఓ సారి డాక్టర్ పీటర్సన్ కి కలవండి. చివరిగా ఈ ట్రీట్ మెంట్ ఇష్టం ఉంటే మొదలుపెట్టవచ్చు." ఇంత జరిగాక జితేంద్ర, ఆషాలతో మాట్లాడింది కేన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ పీటర్సన్. ఆవిడ చెప్పడం ప్రకారం, "ఇది ఇంకా ప్రయోగాల స్టేజీలో ఉంది. మిగిలిన ఒక్క ఆశ ఇదే. మీకు ఇష్టం ఉంటే జేర్పించండి. లేదా, పోయేదేమీ లేదు. కుర్రాడికి తగ్గుతుందని ఏమీ గారంటీ లేదు. పనిచేయవచ్చు, లేకపోవచ్చు. ఇంక బాధ పెట్టకుండా అలా వదిలేస్తాం అంటే మీ ఇష్టం. పనిచేసి కుర్రాడికి బాగుపడితే పూర్తిగా ఆరోగ్యం రావడానికి మరో ఆరు నెలల నుంచి ఏడాది పైన పట్టవచ్చు."

"అసలీ మందు ఎలా పనిచేస్తుంది? ఇప్పటివరకూ వాడినవి ఏవీ పనిచేయలేదు కదా?" జితేంద్ర అడిగేడు.

తన లేబ్ లోకి తీసుకెళ్ళి అక్కడున్న ఛార్టులూ బొమ్మలూ చూపిస్తూ డాక్టర్ పీటర్సన్ చెప్పడం మొదలుపెట్టింది. "మీ కుర్రాడి రక్తంలోంచి కొన్ని టి–సెల్స్ బయటకి తీస్తాం మొదటిగా. వాటిని లేబ్ లో జెనెటిక్ గా మార్చాలి, కైమరిక్ ఆంటీజెన్ రిసెప్టర్ (సి. ఏ. ఆర్) లాగా. ఈ టి సెల్స్ లోంఛి తయారు చేసిన సి.ఏ.ఆర్ నే కార్–టి సెల్స్ అంటున్నాం. వాటిని ఎక్కువగా తయారుచేసి మళ్ళీ కార్తీక్ రక్తంలోకి వదులుతాము. అవి కేన్సర్ కణాలలో ప్రోటీన్స్ ని చటుక్కున పట్టుకోగలవు. ఓ సారి కార్ – టీ సెల్స్ కేన్సర్ కి అతుక్కుంటే వాటిని అక్కడికక్కడే చంపేస్తాయి. వీటివల్ల మరో సుఖం ఏమిటంటే ఈ కార్–టి సెల్స్ శరీరంలో చాలాకాలం పాటు ఉంటాయి. అందువల్ల

అసలంటూ పనిచేయడం మొదలుపెడితే దాదాపు జీవితాంతం అవి మరోసారి కేన్సర్ రాకుండా కాపాడతాయి. అయినా చెప్పానుకదా, ఇది పనిచేస్తుందా అనేది ఇంకా ఏదీ ఇతమిత్థంగా తెలియదు. మీ కుర్రాడే మొదటి పేషెంటు మా లేబ్ లో. అంటే ఇవి పనిచేస్తాయా లేదా అనేది మీతోపాటు మేము కూడా నేర్చుకోవాలి."

కన్నతల్లి కనక ఆషా వెంటనే "తప్పకుండా మొదలుపెట్టండి" అనేసింది కానీ జితేంద్ర మనసులో రెండు ఆలోచనలు తగిలాయి. అసలే కుర్రాడికి నీరసంగా ఉంది, దాదాపు ప్రతీ రోజు కీమోథెరపీ అనో మరోటో అనో సూదులు గుచ్చుతున్నారు. ఈ స్థితిలో ఇంకా బాధపెట్టడం దేనికీ? పోనీ ఈ మందు వల్ల తగ్గుతుందా అంటే గారంటీ లేదని ఆవిడే అంటోంది. ఇలా పది నిముషాలు అటూ ఇటూ కేన్సర్ ఆస్పత్రి కారిడార్లలో తిరిగేడు, ఏం చెప్పాలో తెలియక. చివరికి ఆషా మొహం చూసి ఒప్పుకోక తప్పింది కాదు. అదే రోజు ఈ ట్రీట్ మెంట్ వల్ల కుర్రాడు పోయినా కోర్టులో కేసు వేయం అనీ, మరొకటనీ కాయితాల మీద అన్నీసంతకాలు పెట్టించుకున్నాక కార్-టి ట్రీట్ మెంటు మొదలుపెట్టారు కార్తీక్ మీద.

❦❦❦

ట్రీట్ మెంట్ సాగుతూంటే మొదటివారంలో కార్తీక్ కి విపరీతమైన జ్వరం, ఊపిరి ఆడకపోవడం అయ్యేసరికి ఇంటెన్సివ్ కేర్ లోకి మార్చబడ్డాడు. ఆ సరికి నర్సులు మాట్లాడుకోవడం ప్రకారం జితేంద్రకి తెలిసినది, కుర్రాడు మరో రెండు వారాలు బతికితే గొప్పే. పులి మీద పుట్రలా ఇప్పుడు కార్తీక్ కి కిడ్నీలు పాడవుతున్నట్టు బ్లడ్ రిజల్ట్ చూపిస్తోంది. ఆ వారంలోనే పీటర్సన్ చెప్పింది, హితులూ స్నేహితులూ, చుట్టాలనీ పిలవమని – చివరి చూపుకి. ఓ మందుకి ప్రయోగం చేసినప్పుడు ఫలితాలు ఇలా ఉంటాయని తెలియడానికి ముందు ఎవరో ఆ మందు వేసుకుని ఉండాలి కదా? కానీ ఇది మొదటిసారి ఈ ప్రయోగం చేయడం. మొదటి పేషెంటు కార్తీక్. అయితే డాక్టర్ పీటర్సన్ అనుకున్నట్టూ కార్తీక్ కి ప్రాణం పోలేదు. మరో రెండు రోజులు ఇంటెన్సివ్ కేర్ లో ఉన్నాక కాస్త స్థిమితపడ్డాడు. కానీ బయటకి మామూలు వార్డ్ లోకి పంపడానికి డాక్టర్ పీటర్సన్ కి మనసొప్పలేదు. కుర్రాణ్ణి అక్కడే ఉంచుదామని నిర్ణయించుకున్నాక ఇటువంటిదే మరో కేసు చేతిలోకి వచ్చింది ఆవిడకి. దాదాపు కార్తీక్ కేసు లాంటిదే, అన్ని ఆశలూ పోయాక చివరిగా కార్-టి పనిచేస్తుందేమోనని చూడ్డానికి వచ్చేరు.

ఆ రెండో కుర్రాడిక్కూడా ఈ ట్రీట్ మెంట్ మొదలుపెట్టాక మళ్ళీ ఇదే పద్ధతి. జ్వరం, కిడ్నీలో పాడవుతున్నట్టు చెప్పే బ్లడ్ రిజల్ట్! ఈ రిజల్ట్ చూసిన పీటర్సన్ కి ఒక్కసారి ఏదో యురేకా అన్నట్టు తట్టింది. ఇద్దరు కుర్రాళ్ళకీ ఒకేరకమైన ట్రీట్ మెంట్, ఇద్దరికీ ఒకేలాగ జ్వరం, కిడ్నీ పాడవుతున్నట్టూ చూపిస్తోంది. మందుకానీ పనిచేస్తోందా? మరో రెండు మూడు వారాలు ఇద్దర్నీ అలాగే ఇంటెన్సివ్ కేర్ లో ఉంచమని చెప్పి తన కూడా పనిచేసే డాక్టర్లతో వివరాలు మాట్లాడ్డానికి వెళ్ళింది.

ఆ మాటల్లో తెలిసివచ్చినదేమిటంటే దాదాపు మందు పనిచేస్తోంది. మరి కొన్నివారాల దాకా చూడ్డం మంచిది. ఎలాగా పిల్లలిద్దరూ పోతారని తెలిసినప్పుడు మరో కొద్ది రోజులు వేచి చూడ్డంలో తప్పేముంది?

❦❦❦

ఆరువారాలు గడిచాక పిల్లలు ఇద్దరూ కోలుకోవడం మొదలుపెట్టేసరికి, అప్పుడు చేసిన బరో బ్లడ్ టెస్ట్ లో తెలిసివచ్చినది విని డాక్టర్ పీటర్సన్ కి నోట మాట రాలేదు. కార్-టి సెల్స్ కార్తీక్ రక్తంలో ఉన్న దాదాపు రెండుమూడు పౌనుల కేన్సర్ సెల్స్ ని చంపేసాయి. కుర్రాడికి జ్వరం, కిడ్నీ ప్రోబ్లెం ఉన్నట్టు చూపించినది ఇలా చచ్చిపోయిన కేన్సర్ సెల్స్ వల్లే. కార్-టీ సెల్స్ పనిచేస్తున్నాయి, అదీ మామూలుగా కాదు,

అద్భుతంగా! కీమోథెరపీలో కూడా ఇంత వేగంగా రిజల్ట్ కనిపించదు. వళ్ళు గగుర్పొడుస్తూండగా వెళ్ళి ఆషా జితేంద్రలతో చెప్పింది ఈ మాట. అయితే ఇంకా పూర్తిగా తగ్గలేదు కనక కాస్త జాగ్రత్తగా చూస్తూ ఉండాలి. కార్-టి సెల్స్ వల్ల మరో ఇమ్యూన్ రియాక్షన్ వస్తే? అందుకే మరీ అంత సంతోషం పనికిరాదు అప్పుడే.

మరో నెల గడిచాక కార్తీక్ ని ఇంటికి పంపించేరు. నీరసంగా ఉన్నాడు కానీ కేన్సర్ తగ్గుతోంది. మృత్యువు వడిలోకి వెళ్ళి దాదాపు నెలల తర్వాత దాని ముఖంలోంచి దిగ్విజయంతో బయటకి రావడానికి సిద్ధమౌతున్నాడు. అది చాలదా?

జరిగినదంతా విన్న ఆషా తల్లి ఫోనులో చెప్పింది, "నేను చెప్పాను కదే, మృత్యుంజయ జపం చేస్తున్నాననీ? ఇండియా వచ్చినప్పుడు కుర్రాణ్ణి నాసిక్ లో గుడికి తీసుకెళ్దాం. ఏమీ కంగారు లేదు."

ఈ తతంగం గడిచిన ఎనిమిది నెలలకి జితేంద్ర ముందు నడుస్తూ ఉంటే, కార్తీక్ తల్లి చేయి పట్టుకుని డాక్టర్ పీటర్సన్ ఆఫీసుకొచ్చాడు మరో సారి బ్లడ్ టెస్ట్ చేయించుకోవడానికి. ఇంకా వళ్ళు చేయలేదు కానీ, కళ్ళలో వెలుగు కనిపిస్తోంది. నర్సు బ్లడ్ సాంపిల్ తీసుకున్నాక డాక్టర్ ఆఫీసులో కూర్చున్నప్పుడు చెప్పిందావిడ, "కార్-టి సెల్స్ పనిచేస్తున్నాయన్నమాట నిజమని తెలుస్తోంది కదా, అయితే ఇప్పుడవే సెల్స్ కుర్రాడి వంట్లో ఇమ్యూన్ సిస్టం మీద పనిచేస్తూ ఉండవచ్చు; అంటే ఏ సెల్స్ మొదట్లో కేన్సర్ గా మారాయో అవే ఇమ్యూన్ సెల్స్ ని ఈ కార్-టి చంపేస్తూ ఉంటుంది. అందువల్ల ఫ్లూ, దగ్గు, న్యుమోనియా లాంటివి మిగతావాళ్ళకన్నా ఈ కుర్రాడికి రావడానికి అవకాశం ఎక్కువ. ఇన్ని వారాలకని చొప్పున ఓ సారి వచ్చి ఇమ్యూనోగ్లోబులిన్ థెరపీ లాంటిది తీసుకుంటూ ఉండాలి. ఒక్కోసారి ఇంజెక్షన్, అది కుదరకపోతే చిన్నపాటి ఇన్ఫ్యూజన్ చేయాలి. వచ్చిన ప్రతీసారీ గంటా రెండు గంటల్లో ఇంటికి వెళ్ళిపోవచ్చు. సరేనా?"

ఆషా అంది వెంటనే, "నేను మొదటిసారి కనడమైతే వాణ్ణి కన్నానండి. కానీ మీరు వాడికి ప్రాణం పోసారు. ఈ చిన్న చిన్న సూదుల వల్ల జరిగే నష్టం ఏపాటిది వాడి ప్రాణంలో పోలిస్తే? మీరేం చెప్తే అదే"

"సరే అయితే మిమ్మల్ని చూద్దామని మరొక విజిటర్ వచ్చారు ఈ రోజు. కలుస్తారా?" డాక్టర్ పీటర్సన్ అడిగింది మొహంలో వచ్చే చిరునవ్వు దాచిపెట్టి.

"విజిటర్సా? మాకా? మీ ఆఫీసులోనా?" జితేంద్ర అడిగేడు ఆశ్చర్యంగా.

డాక్టర్ పీటర్సన్ తనకూడా రమ్మంటూ ఏమీ మాట్లాడకుండా లేచి పక్కరూములోకి నడిచింది. ఆవిడ వెనకే ముగ్గురూ నడిచేరు. అక్కడ కనిపించినది ఒకప్పుడు కార్తీక్ ని రెగ్యులర్ గా ఎమర్జన్సీలో చూసిన డాక్టర్ జేమీసన్, ఆయన కూతురు జెన్నీఫర్.

జితేంద్ర వెళ్ళి చేయి కలిపేడు జేమీసన్ కి. జేమీసన్ అన్నాడు, "కుర్రాడు బాగున్నాడండి, మరో మూడు నాలుగు నెలల్లో స్కూలికెళ్ళొచ్చు." అటు తిరిగి కార్తీక్ తో చేయి కలుపుతూ అడిగేడు, "కార్ట్, మరోసారి సాకర్ కి వెళ్తావా లేకపోతే అమెరికన్ ఫుట్ బాల్ నచ్చుతుందా? ఇది మా పాప జెన్నీఫర్" పరిచయం చేసాడు.

"అమెరికన్ ఫుట్ బాల్ నాకు నచ్చదు. సాకర్ కే వెళ్తా," కార్తీక్ చెప్పేడు జేమీసన్ ఇచ్చిన చేతిని అందుకుని.

జితేంద్రకి ఆషాకీ ఏమనాలో తెలియలేదు. గొంతులోంచి మాట ఏదో గరుగ్గా వస్తూంటే జితేంద్ర అన్నాడు, “మీ ఇద్దరి సహాయం లేకపోతే వీడు బతికి ఉండేవాడు కాదు. మేము చర్మం వలిచి ఇచ్చినా మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేము. అవునా ఆశా?” అంటూ వాళ్ళావిడకేసి చూసాడు. ఆవిడ ఏమీ మాట్లాడలేక పక్కకి తిరిగి కన్నీళ్ళు తుడుచుకుంటోంది.

“భలేవారే, మాకు చేతనైనది మేము చేసాం. దీని వల్ల మరికొంతమందికి జీవితం మీద ఆశలు చిగురిస్తాయి. డాక్టర్ జేమీసన్ కి చెప్పుకోవాలి మీరు కృతజ్ఞతలు ఎందుకంటే మిమ్మల్ని కార్–టి మొదలుపెట్టమని ప్రోత్సాహించినది ఆయనే. నేను మొదట అడుగుదామనుకున్నాను, కానీ మీకు చెప్తే ఏమంటారో తెలియదు. అసలే కార్తీక్ మొదటి పేషెంట్ ఈ ప్రయోగం మీద” డాక్టర్ పీటర్సన్ అంది.

జేమీసన్ అన్నాడు, “నాకసలు ఈ కార్–టి అనేదే తెలియదు. నా ఉద్యోగంలో ఎప్పుడూ బిజీగా ఉండడం వల్ల అసలు ఇవి గానీ కొత్తగా వచ్చే ఏ విషయాలూ తెలియటంలేదు. అయితే మా పాప జెన్నీఫర్ మీ కుర్రాడి పేరు అడిగితే చెప్పాను. ఆ పేరుకి అర్ధం ఏమిటా అని చూడబోతే ఈ కార్ – టి గురించి తెలిసింది. అందువల్ల మీకు సహాయం చేసినది నేనుకాదు, మా జెన్నీఫర్.”

“ఇంతకీ కార్తీక్ అంటే ఏమిటండి అర్ధం?” జెన్నీఫర్ అడిగింది.

“హిందువులలో ముగ్గురు దేవతలు ఉన్నారమ్మా. అందులో ఒకాయన శివుడు. ఆయనని మృత్యుంజయుడు – అంటే మరణాన్ని జయించినవాడు – అంటారు. ఆయనకి పుట్టిన కుర్రాడి పేరే కార్తీక్. ఆ కుర్రాడిని షణ్ముఖుడనీ, కుమార్ అనీ కూడా పిలుస్తారు.” జితేంద్ర చెప్పేడు.

“అంటే సరిపోయింది కదా? మృత్యుంజయుడు తన అబ్బాయి పేరే ఉన్న మన కార్తీక్ ని కేన్సర్ ఏమీ చేయకుండా అడ్డుకున్నాడు కదా?” జెన్నీఫర్ అంది. అందరికీ నవ్వొచ్చింది పాప అన్న మాటకి.

ఎందుకో ఒక్కసారి ఆషాకి తన తల్లి తనతో మృత్యుంజయుడికి చేసిన జపం, నాసిక్ లో గుడీ, అవన్నీ ఆవిడ తనకి ఫోనులో చెప్పడం గుర్తొచ్చాయి.  మనసులోనే ఒక దణ్ణం పెట్టుకుని అందరితో చెప్పి బయటకొచ్చింది.

[టైమ్ పత్రిక, ఆగస్టు 21, 2017 వారు ప్రచురించిన ఆర్టికిల్ (కేన్సర్ కి కొత్త మందు, పేజీలు 34–37) ఆధారంగా ఈ కథ అల్లాను. కార్–టి అనేది నిజంగానే ప్రయోగాత్మకంగా కేన్సర్ ని రూపుమాపడానికి వాడుతున్నారు. కావాల్సినవారు గూగుల్ చేస్తే విషయాలు తెలుస్తాయి. ఈ కథ మూలాన ఏ ఒక్కరికి ఆ కార్–టి కేన్సర్ ట్రీట్ మెంట్ గురించి తెలిసినా, వారు బాగుపడ్డా, అంతకన్నా ఈ కథకి ప్రయోజనం మరొకటి ఉండబోదు.]

COMMENTS